క్లుప్తంగా

సొంతగూటికి 35 కుటుంబాలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోయ తిప్పేస్వామి

బ్రహ్మసముద్రం : మండలంలోని పిల్లలపల్లికి చెందిన 35 కుటుంబాల వారిని మభ్యపెట్టి టీడీపీ నాయకులు ఆపార్టీలోకి బుధవారం చేర్చుకున్నారు. ఒక రోజు గడవకముందే అదే 35 కుటుంబాల వారు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయతిప్పేస్వామి, బ్రహ్మసముద్రం ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమత రెడ్డి, తిప్పారెడ్డి , యువ నాయకుడు అంజి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్వామివారం కావడంతో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులోని మక్కా మసీదులో ముస్లిం యువకుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్ష విరమించి మగ్‌రిబ్ నమాజ్ అనంతరం పెద్ద ఎత్తున ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆకలి విలువ తెలుసుకోవడమే ఇఫ్తార్ ముఖ్య ఉద్దేశమని మసీదు ఇమామ్ ముఫ్తీ నూర్ మహమ్మద్ తెలిపారు.

జీవాలకు బీమా చేయించండి

కుందుర్పి: మండలంలోని పశువులు, గొర్రెలు మేకలు పెంచుకున్న రైతులు స్థానిక పశువైద్యశాలలో బీమా చేయించుకోవాలని పశు వైద్యాధికారి ప్రసాద్, లైవ్‌స్టాక్ అసిస్టెంటల్ మల్లికార్జున తెలిపారు. రూ.6 వేల విలువ చేసే గొర్రెకు ఏడాదికి రూ.25 మూడేళ్లకైతే రూ.75 చెల్లించాలన్నారు. రూ.50 వేలు విలువ చేసే పశువులకు మూడేళ్లకు రూ.2వేలు చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు.

తిప్పేరుద్రస్వామి వసంతోత్సవం

కుందుర్పి: వదనకల్లులో గురు తిప్పేరుద్ర స్వామి రథోత్సవంలో భాగంగా వసంతోత్సవం, పానకం బండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు గురువారం కనులపండువగా జరిగాయి. ఉదయం వసంతోత్సవం సందర్భంగా వెండి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పానకం బండ్లతో ప్రత్యేక పూజలు చేపట్టారు. జాతరలో నాలుగు రోజులుగా ఆరువేల పశువులు క్రయ,విక్రయాలు జరిగాయి. శుక్రవారం పూల రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ తెలియజేసింది.

కోడెదూడకు మూత్రాశయ శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స చేసిన కోడెదూడతో పశువైద్యులు

బెళుగుప్ప: శ్రీరంగాపురంలో రైతు రంగనాథ్‌కు చెందిన కోడెదూడకు పశువైద్యులు మూత్రాశయ శస్త్ర చికిత్స చేశారు. గ్రామానికి చెందిన రైతు రంగనాథ్‌కు చెందిన ఏడాదిలోపు వయస్సున్న కోడెదూడ ఆరు రోజులుగా మూత్రం పోయలేదు. కడుపు ఉబ్బిపోయి నడవలేని స్థితిలో ఉంది. రైతు పశువైద్య చికిత్సలకు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయగా కళ్యాణదుర్గం పశువైద్యశాల నుంచి అంబులెన్స్ వచ్చి కోడెదూడను పరీక్షించి, శస్త్ర చికిత్స కోసం అనంతపురం ప్రాంతీయ పశువైద్యశాలకు తరలించారు. కోడెదూడను పరిశీలించిన పశువైద్యులు పద్మనాభం, సురేష్, రమేష్ దూడ మూత్రనాళానికి రాళ్లు అడ్డుపడినట్లు గుర్తించారు. శస్త్రచికిత్సద్వారా మూత్రాశయం ద్వారా మూత్రం బయటకు వెళ్లే విధంగా దూడకు ఫ్లూయిడ్స్, యాంటి బయోటిక్స్ అందించారు. శస్త్రచికిత్స అనంతరం కోడెదూడను అంబులెన్స్‌లో రైతు ఇంటికి చేర్చారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య


గూబనపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు


జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్న రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి గ్రామంలోని 24వ వార్డులో ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున రంగయ్యకు స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి త్వరలో జరగబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు సార్లు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగనన్న చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రచార కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రం చేయలేని విధంగా సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, సేవలను పల్లె ముంగిటకే తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. మీఇంట్లో మంచి జరిగింది అంటే నాకు ఓటు వేయండి అని దేశంలో ఏ నాయకుడూ అనలేదన్నారు. జగనన్నను ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేక దేశంలోని పొత్తు పెట్టుకొని కూటమిగా ప్రజల్లోకి వెళ్తున్నారన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా రానున్న ఎన్నికల్లో జగనన్న విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. 14 సంవత్సరాల సీఎంగా ఉన్నా చంద్ర బాబునాయుడు పేదల కోసం ఏమి చేసాడో చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ అర్చన, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, కురుబ సంఘం అధ్యక్షుడు దొణస్వామి, కోఆప్షన్ మెంబర్ అబ్జల్, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి షేక్ష, నాయకులు తిరుమల వెంకటేశులు, అక్కమ్మగార్ల ఆలయ కమిటీ మాజీ చైర్మన్, కిరీటి, గోళ్ల సూరి, రేవన్న, సుధీర్, మల్లాపురం మల్లి, బిక్కి హరి, రిజ్వాన, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక సెల్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని 32 వార్డుల్లోనూ ఎక్కడైనా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కిశోర్, డీఈ సురేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల నుంచి సమస్యలను స్వీకరించేందుకు ప్రత్యేక సెల్ పని చేస్తుందన్నారు. సెల్: 7995080752 సంప్రదిస్తే సంబంధించి శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ప్రత్యేక సెల్ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గౌరీదేవి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చూడాలన్నారు. అవసరం ఉన్న చోట్ల బోరుబావులు తవ్వించి నీటి సమస్య పరిష్కరించాలని తెలిపారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరాఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుహోళకు చెందిన గోవిందు (43) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మండలంలోని కల్లుహోళకు చెందిన గోవిందు మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు భార్య బెస్త ఈరమ్మ డబ్బులు ఇవ్వలేదని, మనస్థాపంతో ఈనెల 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

దేవగిరిలో : మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రసన్న (47) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు హేమంత నాగ వెంటకసాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు.

గిరిజన తండాలో విస్తృత ప్రచారం


బ్రాహ్మణపల్లి తండాలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బెళుగుప్ప: మండలంలోని రమనేపల్లి పంచాయతీ ఆవాస గిరిజన గ్రామం బ్రాహ్మణపల్లి తండాలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర రెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, రమనేపల్లి సర్పంచ్ రమేష్ కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, సహకార సంఘాల అధ్యక్షుడు శివలింగప్ప, శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ బాట్ల ధనుంజయ, నాయకులు గోపాల్‌నాయక్, కమలనాయక్, కరుణాకర్, పాతన్న, తిమ్మప్ప, మారెన్న, అనిల్, ధనుంజయ, రాజునాయక్, శ్రీరాములు, సన్నప్ప, వేణుగోపాల్‌నాయక్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం


వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ


వివాహ వేడుకలో పాల్గొన్న తలారి రంగయ్య, శంకరనారాయణ

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంటలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సర్పంచ్ రత్నమ్మ దంపతుల కుమారుడు వరుడు హరికృష్ణ, వధువు రూప వివాహవేడుక గురువారం జరిగింది. ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, వాల్మీకి సంక్షేమ సంఘం ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు ఈశ్వరయ్య, , ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, రాష్ట్ర నాయకులు త్రిలోక్‌రెడ్డి, సహకార సంఘ అధ్యక్షులు శివలింగప్ప, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, ఉరవకొండ ఎంపీపీ నరసింహులు పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కళ్యాణదుర్గం రూరల్ : బోరంపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ బూసెప్ప గారి రామాంజనేయులు కుమారుడి వివాహ వేడుకలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తలారి రంగయ్య, శంకరనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, కురుబ సంఘం తాలుక అధ్యక్షులు దొణస్వామి, బోరంపల్లి కృష్ణారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, బండి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మరుట్ల-2వ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నేత వడ్డే అజయ్ కుమార్ వివాహం గురువారం మరుట్లలో జరిగింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్‌రెడ్డి హాజరయ్యారు.

రేషన్ డీలర్ ఎన్నికల నిబంధనల ఉల్లంఘన


గడేహోతూరులో పయ్యావుల విజయ్‌సింహాతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేషన్ డీలర్ ఎస్.నాగరాజు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరులో రేషన్ డీలర్ ఎస్.నాగరాజు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించాడు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సేవలు అందిస్తున్న వారు ఏ ఒక్కరూ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే గ్రామంలో గడేహోతూరు డీలర్ ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విజయ్‌సింహాకు ఘన స్వాగతం పలకడంతోపాటు ఆయనతోపాటు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. టీడీపీకి ఓటు వేయాలని ఓటర్లను స్వయంగా అభ్యర్థించాడు. రేషన్‌డీలర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడాన్ని ప్రజలు గమనించి, వీరికి ఎన్నికల నిబంధనలు వర్తించవా? అని చర్చించుకున్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

బ్రహ్మసముద్రం : మండలంలోని ఎరడికెరకు చెందిన వీఆర్‌ఏ ఎట్టి గంగప్ప (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. తహసీల్దార్ ఈశ్వరయ్య, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆర్‌ఐ నాగిరెడ్డి ఎరడికెరలోని మృతుడి నివాసంలో మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వీఆర్‌ఓ హెచ్.లాలు స్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

శెట్టూరు: మండల పరిధిలోని బచ్చేహళ్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త లింగప్ప గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య నాయకుల ద్వారా రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. లింగప్ప మృతదేహానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ నరసింహులు, నాయకులు ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, వీరాంజనేయులు, అనంతరెడ్డి, రాజశేఖర్, వెంకటేశులు, నాగన్న, హుసేన్, వన్నూరుప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై అపరాధ రుసుం

రాయదుర్గం రూరల్: గుమ్మగట్ట మండలంలోని భూపసముద్రం, రంగచేడు వద్దనున్న వేదావతి నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. రంగచేడు వెంకటేశులుకు చెందిన ట్రాక్టర్, భూపసముద్రం మల్లేశప్పకు చెందిన ట్రాక్టర్లను వైఎస్సార్ సర్కిల్ వద్ద పట్టుకున్నారని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిద్దరికి రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్లు సీఐ తెలిపారు.

నేడు కుందుర్పిలో ఎన్నికల ప్రచారం

కుందుర్పి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, ఎంపీపీ కమలమ్మ తదితరులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం ఉంటుందన్నారు.

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తోట వెంకటేశులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి మే 22వ వరకు https://apms.apcfss.in, www.cse.ap.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి 345 దరఖాస్తులు అందినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అగ్నికి ఆహుతైన అరటితోట


మంటల్లో కాలిపోయిన అరటితోట

కళ్యాణదుర్గం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఐదు ఎకరాల అరటి తోట కాలిపోయింది. వివరాలు.. మండల పరిధిలోని నుసికొట్టాల గ్రామంలోని జోగిరెడ్డి అనే రైతుకు చెందిన ఐదెకరాల్లో అరటి సాగు చేశాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అరటి తోటకు నిప్పుపెట్టడంతో పంట మొత్తం కాలిపోయింది. సుమారుగా రూ.20 లక్షల వరకు నష్టపోయినట్లు బాధిత రైతు జోగిరెడ్డి తెలిపాడు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

కంబదూరు: మండలంలోని ఓబగాని పల్లికి చెందిన నిరుపేద దంపతులు సిరాజ్ బాషా, మల్లికాబేగం దంపతుల కుమార్తె తస్లీమా చదువు కోసం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ గురువారం రూ. 22 వేలు ఆర్థిక సాయం అందించారు.

కరుణామయుడు క్రీస్తు


ప్రార్థనలకు సిద్ధమైన సీఎస్‌ఐ చర్చి

అనంతపురం కల్చరల్: మానవేతి హాసంలో సమాధి నుంచి సజీవంగా పునరుత్థానుడైన ఏకైక వ్యక్తి దైవ కుమారుడు ఏసుక్రీస్తు. ప్రేమే మార్గంగా.. త్యాగమే ఆయుధంగా ప్రేమతో మానవాళిలోని పాపాలను కడిగివేయడానికి పాపుల కన్నీళ్లు తుడవడానికి భువిపై అవతరించిన దయామయుడు సిలువపై రక్తం చిందించిన రోజును 'గుడ్ ఫ్రైడే'గా జరుపుకుంటాం. లోకములోని సమస్త పాపాలు కడిగివేయబడి అందరినీ తన రక్తంతో.. త్యాగంతో పరిశుద్ధాత్ములుగా మార్చిన రోజు కాబట్టి శుభ శుక్రవారం అంటున్నామని మత పెద్దలు చెబుతారు. మానవత్వ విలువలను పెంచడం కోసం సిలువపై వేలాడుతూ కూడా క్షమాపణ, రక్షణ, ప్రేమ, ఎడబాటు, అకాంక్ష, విజయం, అప్పగించుట అనే ఏడు అమృతవాక్యాలను శాంతి ప్రపంచానికి అందించారు.

మూడు రోజుల పాటు ప్రార్థనలు


గుడ్ ఫ్రైడే అంటే హంగులు, ఆర్భాటాలు కాదని.. భగవంతుడికి మన హృదయాన్ని సమర్పించుకోవడమేనని పరిశుద్ధ గ్రంథం బైబిల్ ప్రవచిస్తోంది. ఏసు సిలువపై చిత్రహింసలు అనుభవించి మరణించిన మూడవ రోజు పునరుత్థానుడై లోకానికి శుభ సందేశమందించాడు. దానిని 'ఈస్టర్'గా ఆదివారం జరుపుకుంటారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థనలు, శనివారం రన్ ఫర్ జీసెస్, ఆదివారం ఈస్టర్ వేడుకలకు అరవింద నగర్‌లోని సీఎస్‌ఐ చర్చి, సప్తగిరి సర్కిల్‌లోని ఎస్‌ఐయూ చర్చి, రామచంద్ర నగర్‌లోని కార్మియల్ మాతా మందిరం, కోర్టు రోడ్డులోని గాస్పెల్‌హాల్, కళాకారుల కాలనీలోని రేమా చర్చి తదితర ప్రార్థనా మందిరాల్లో ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు ఆహ్వానిస్తూ చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ప్రార్థనా, సేవ రెండూ ముఖ్యమే

గుడ్‌ఫ్రైడే మహోత్సవాన్ని కేవలం ప్రార్థనలతోనే కాకుండా దైవమార్గమైన సేవలో తరించాలి. పాపులను పరిశుద్ధాత్ములుగా మార్చడానికి క్రీస్తు చూపిన త్యాగనిరతిని, కరుణామయుడి ఆదర్శ జీవితాన్ని అవగాహన చేసుకుంటే జీవితంలో ఏమి చేయాలో తెలుస్తుంది. మన హృదయాన్ని దైవకుమారుడికి సమర్పించుకోవడమే వేడుకగా భావించాలి. శాంతి కోసమే దైవకుమారుడు మనుషులతో తిరుగాడి మనల్ని పునీతుల్ని చేసి తాను శాపం అనుభవించాడు. ఆ త్యాగం వృథా కాకుండా విలువలతో జీవించాలి.

– రెవరెండ్ నెహమ్యా నాగరాజ్, పాస్టర్ల సంఘం అధ్యక్షుడు

ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. ఈ ఏడాది ఏప్రిల్ 9 నుంచి 11వ తేదీ వరకూ ఉగాది ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల నిర్వహణలో భాగంగా గురువారం ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో వివిధ శాఖల అధికారులతో ఈఓ భద్రాజీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ జోక్యం లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని, ఆలయ పరిసరాల్లో మద్యం విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉత్సవాలు జరుగనున్న మూడు రోజులు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలాన్నరు. అన్ని శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు.

ఘనంగా ఆరాధన

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి మహారాజ్ 30వ ఆరాధన గురువారం రాత్రి ఘనంగా జరిగింది. సామూహిక పంచామృతాభిషేకాలు, పల్లకీసేవ, ధ్యాన భజన, అన్నప్రసాద వితరణ జరిగింది. హిందూపురం, ముదిరెడ్డి పల్లి, శివబాలయోగి మహారాజ్ ఆశ్రమాల నుంచి భక్తులు తరలివచ్చారు. తీర్థప్రసాద వితరణలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

గుత్తి: పట్టణంలోని కాల్వగడ్డ ఆంజనేయనేయ స్వామి క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభమవుతుందని నిర్వాహకుడు శ్రీనివాస బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

మొక్కల పరిరక్షణపై సదస్సు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం 'మొక్కల పరిరక్షణ వ్యూహాల్లో దృక్పథం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్కేయూ ప్రొఫెసర్ బి.రవిప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరై పర్యావరణం, జీవ వైవిధ్య విలువలు, భూమి మీద జీవం, నైతిక విలువలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా వృక్షశాస్త్రం విభాగాధిపతి శ్రీదేవి, అధ్యాపకులు పి.అమృత లక్ష్మి, ఎం.విష్ణుప్రియ, డి.రఘురాములు, బి.మనోహరరెడ్డి, పి.అక్బర్ బాషా పాల్గొన్నారు.

ఆలయంలో కిక్కిరిసిన భక్త జనం

- 30 బ్రహ్మ రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన రథోత్సవం ఈ నెల 30న శనివారం అశేష భక్త జన సందోహం మధ్య జరగనుంది. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తాదులతో ఆలయ ప్రాంగణం రథోత్సవానికి రెండు రోజుల ముందే కిటకిట లాడిపోతోంది. ఇదిలా ఉండగా రథోత్సవం నాడు రథాన్ని ప్రారంభించేందుకు ఆరోజు ఉదయం 7.20 గంటల నుండి 8.10 గంటల మధ్య శుభ ముహూర్తంగా అర్చక పండితులు నిర్ణయించారు. రథం లాగేందుకు ఆనవాయితీగా వచ్చే కుటాగుళ్ళ, బేరిపల్లి, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి, మూర్తిపల్లికి చెందిన భక్తాదులను నేరుగా వెళ్లి ఆలయ అధికారులు ఆహ్వానించి వచ్చారు. రథోత్సవం నాడు పట్టణంలో సుమారు 60 చోట్ల ఉచిత అన్నదానం చేసేందుకు దాతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా రథోత్సవం సందర్భంగా ఆరోజు పట్టణంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు కదిరి డీఎస్పీ శ్రీలత తెలిపారు. తిరువీధుల్లో బస్సులతో పాటు ఇతర వాహనాలు తిరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

హుండీకానుకల లెక్కింపు


ఆలయంలో హుండీకానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆలయ సిబ్బంది, గ్రామస్తుల ఆధ్వర్యంలో హుండీకానుకల లెక్కింపు నిర్వహించారు. రూ.9,96,076 ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ తెలిపారు. అనంతరం స్వామికి అభిషేకాలతో పాటు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

మహిళా న్యాయవాదిపై దాడి

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా న్యాయవాది కే.లక్ష్మిపై విరాజ్ బిల్డర్స్ అధినేత టి.సోమశేఖర్ రెడ్డి, వడ్డే భానుమూర్తి గురువారం దాడి చేశారు. బాధితురాలు తెలిపిన వివరాలు.. అనంతపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఓ స్థలం రిజిస్టర్ చేయించే విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తాను న్యాయవాది అని చెప్పినా వినకుండా.. న్యాయవాది అయితే ఏం పీక్కుంటావో పీక్కో అంటూ దాడి చేసినట్లు లక్ష్మి వాపోయింది. బాధితురాలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. న్యాయవాదులు సి.హనుమన్న, హజీజ్ తదితరులు లక్ష్మిని పరామర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.